11-05-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 227 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## భారత్ - పాక్ మధ్య
# యుద్ధం ఆగింది..!



భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. రెండు దేశాలు మధ్యవర్తిత్వం వహించామన్న ట్రంప్.. వెంటనే కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు.

- ఇరుదేశాలు అధికారిక ప్రకటన

**జయభేరి, న్యూఢిల్లీ, మే 10 :**

ఇరు దేశాలకు అభినందనలు తెలియజేస్తున్నానన్న అమెరికా అధ్యక్షుడు.. రెండు దేశాలు సమయస్ఫూర్తితో వ్యవహరించాయని ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాక్‌లోని ఉగ్ర స్థావరాలు ధ్వంసం చేసింది భారత్. అయితే ఇందుకు ప్రతిగా భారత్‌పై దాడులకు దిగింది పాకిస్తాన్. కశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో సరిహద్దు నగరాలపై డ్రోన్ల, ఫైటర్ జెట్లతో దాడులు చేసింది. వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టిన భారత సైన్యం.. పాక్ సైనిక స్థావరాలు, వైమానిక కేంద్రాలపై ప్రతిదాడులు చేసింది. అయితే భారత్ దెబ్బకు అల్లాడిపోయిన పాకిస్తాన్.. భారత్ దాడులు ఆపితే తాము కూడా దాడులు ఆపుతామని ప్రకటించింది. ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని అమెరికాను కోరింది పాకిస్తాన్. దీంతో రంగంలోకి దిగిన అమెరికా.. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చలు చేపట్టింది. ఇరు దేశాల కాల్పుల విరమణ పాటించేలా ఒప్పించాయి.మరోవైపు భారత్, పాక్‌తో చర్చలపై అమెరికా విదేశాంగ కార్యదర్శి రూబియో స్పష్టత ఇచ్చారు. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో కలిసి ఇరుదేశాలతో చర్చించినట్టు ప్రకటించారు. దీనిపై ఇరు దేశాల ...మిగతాది 2 లో




2 లో

## హరీష్ నోట.. చంద్రబాబు మాట...
# టీడీపీ బాధ్యతలా..?

**ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణపై దృష్టి పెట్టారా? టిడిపిని బలోపేతం చేయాలని చూస్తున్నారా? టిడిపి రాష్ట్ర పగ్గాలు సమర్థవంతమైన నేతకు అప్పగించాలని భావిస్తున్నారా? ఇప్పటికే ఆ నేత దొరికారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఏపీలో మాదిరిగా తెలంగాణలో సైతం బిజెపితో జతకట్టాలని చంద్రబాబు చూస్తున్నారు. అంతకుముందు సరైన నేతకు టిడిపి పగ్గాలు అప్పగించాలని భావిస్తున్నారు. గత కొద్దిరోజులుగా చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. కొద్ది రోజుల్లో టిడిపి రాష్ట్ర పగ్గాలు ఓ నేతకు అప్పగిస్తారని తెగ ప్రచారం నడుస్తోంది.**

**జయభేరి, మెదక్, మే 10:**

ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణపై దృష్టి పెట్టారా? టిడిపిని బలోపేతం చేయాలని చూస్తున్నారా? టిడిపి రాష్ట్ర పగ్గాలు సమర్థవంతమైన నేతకు అప్పగించాలని భావిస్తున్నారా? ఇప్పటికే ఆ నేత దొరికారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఏపీలో మాదిరిగా తెలంగాణలో సైతం బిజెపితో జతకట్టాలని చంద్రబాబు చూస్తున్నారు. అంతకుముందు సరైన నేతకు టిడిపి పగ్గాలు అప్పగించాలని భావిస్తున్నారు. గత కొద్దిరోజులుగా చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. కొద్ది రోజుల్లో టిడిపి రాష్ట్ర పగ్గాలు ఓ నేతకు అప్పగిస్తారని తెగ ప్రచారం నడుస్తోంది. 2023 తెలంగాణఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. కాసాని జ్ఞానేశ్వర్ కు టిడిపి రాష్ట్ర పగ్గాలు అప్పగించారు



# ఆచితూచి దెబ్బ..

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏం చేసినా చేతికి మట్టి అంటకుండా చేసుకుంటారు. ప్రత్యర్థికి సానుభూతి కంటే తనపై వ్యతిరేకత రాకుండా చూసుకోవడంలో చంద్రబాబును మించిన వారు లేరు.**

**జయభేరి, విజయవాడ, మే 10:**

జగన్ తరహాలో దూకుడుగా వ్యవహరించరు. అందుకే జగన్ అరెస్ట్ చేయాలని టీడీపీ సోషల్ మీడియాలో హోరెత్తిపోతున్నప్పటికీ తాను మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరిస్తూ కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో తనను యాభై రెండు రోజుల పాటు రాజమండ్రి జైలులో వేసిన జగన్ ను క్షమించి చంద్రబాబు వదిలేస్తారని అనుకోవడం కూడా అవివేకమే అవుతుంది ...మిగతాది 2 లో

# ప్రపంచానికి తెలిసొస్తున్న భారత్ సత్తా

# చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం



- సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది
- ఇప్పుడు భరించేది లేదు దేశ ప్రజల భద్రతే ముఖ్యం
- దేశంలోని ప్రతీ యువతీ యువకుడు త్యాగానికి సిద్ధంగా ఉండాలి

**జయభేరి, మేడ్చల్:**

సూరారంలోని మల్లారెడ్డి హెల్త్ సిటీలో దేశ సైనికులకు సంఘీభావంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథి గా హాజరైయారు. హరీష్ రావు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటుచేసిన మల్లారెడ్డి . , ఇక్కడి ఎమ్మెల్యే వివేక్ గౌడ్ ని నేను అభినందిస్తున్నాను. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం. భారత దేశ సైనికులను చూసి గర్వపడుతున్నాం. సరిహద్దులు అంటే భౌగోళికంగానే కాదు ఈ దేశ ప్రజల భద్రత, దేశ భవిష్యత్తు కూడా. దానిని నిలబెట్టడానికి సైనికులు పోరాడుతున్నారు. పాకిస్తాన్ మన దేశం నుండి విడిపోయినప్పటికీ మన దేశాన్ని ఇబ్బంది పెట్టాలని ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది. ముంబైలో తాజ్ హోటల్ పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేశారు. వారు పాకిస్తాన్ పంపిన ఉగ్రవాదులు అని ప్రపంచం ముందు ఆ దేశాన్ని దోషిగా నిలబెట్టింది భారతదేశం. అమెరికా లాంటి దేశాలపై కూడా ...మిగతాది 2 లో

# నా జీతమంతా అనాధ పిల్లలకే

**జయభేరి, కాకినాడ, మే 10:**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు అండగా ఉండేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే నెల జీతాన్ని ఒక్కొక్కరికీ రూ. 5 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు.పరిపాలనలో తనదైన ముద్ర వేసేలా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముందుకెళ్తున్నారు. ఓవైపు తనకు కేటాయించిన శాఖలపై నిత్యం సమీక్షలు చేస్తూ... అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు పలువురికి సాయం చేస్తూ తనలోని ...మిగతాది 2 లో





# కేరళను తాకనున్న నైరుతీ రుతుపవనాలు
## పేర్కొన్న భారతీయ వాతావరణ శాఖ

**జయభేరి, న్యూఢిల్లీ మే 10 :**

ఈసారి వర్షాకాలం ముందే రానున్నది. మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ పేర్కొన్నది. ఒకవేళ అంచనా వేసినట్లు ముందుగానే రుతుపవనాలు కేరళను చేరితే, అప్పుడు 2009 తర్వాత తొలిసారి వర్షాకాలం ముందుగా వస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతీ కేరళను తాకినట్లు ఐఎండీ డేటా ప్రకారం తెలుస్తున్నది.సాధారణంగా జూన్ ఒకటో తేదీ వరకు కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా ఆ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఇక సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి.2025 వర్షాకాలంలో.. సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వెల్లడించిన విషయం తెలిసిందే. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం నార్మల్ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## టీడీపీ బాధ్యతలా..?

చంద్రబాబు. ఆయన చాలా క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ కార్యక్రమాలను కూడా పెంచారు. అయితే ఇంతలో అప్పటి జగన్ సర్కార్ చంద్రబాబును అరెస్టు చేసింది. 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా చంద్రబాబు జైలులోనే ఉండి పోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనే తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగడంతో.. టిడిపి పోటీకి దూరంగా ఉండి పోవాల్సి వచ్చింది. అయితే ఆ నిర్ణయంతో మనస్థాపానికి గురైన కాసాని జ్ఞానేశ్వర్ తెలుగుదేశం పార్టీకి గుడ్ బై చెప్పారు. కెసిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. దాని భర్తీపై చంద్రబాబు ఎప్పటికప్పుడు ఫోకస్ చేసినా.. నియామకం మాత్రం చేపట్ట లేకపోయారు.అయితే ఇటీవల చాలా రకాల పేర్లు తెరపైకి వచ్చాయి. నందమూరి సుహాసిని, అరవింద్ కుమార్ గౌడ్.. ఇలా చాలామంది ప్రముఖుల పేర్లు వినిపించాయి. అయితే ఇప్పుడు మాజీ మంత్రి హరీష్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బిఆర్ఎస్ కు చెందిన హరీష్ రావు పార్టీ పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. అందుకే పార్టీ మారతారని.. తెలుగుదేశం పార్టీ పగ్గాలు అందిస్తే తీసుకుంటారని తెలంగాణలో కొత్త టాక్ మొదలైంది. అందుకు తగ్గట్టుగానే హరీష్ రావు ఇటీవల చంద్రబాబును పొగుడుతున్నారు. చాలా వేదికల వద్ద చంద్రబాబు గొప్పతనం ప్రస్తావిస్తున్నారు. దీంతో హరీష్ రావు తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని ఒక ప్రచారం అయితే మాత్రం జరుగుతోంది. తొలు త హరీష్ కుమార్ బిజెపిలోకి వెళ్తారని టాక్ నడిచింది. కానీ అక్కడకు వెళ్తే సాధారణ గౌరవం మాత్రమే దక్కుతుందని.. టిడిపిలోకి వెళ్తే నాయకత్వ బాధ్యతలు ఇస్తారని ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.ఇటీవల బిఆర్ఎస్ ఆవిర్భావ సభ జరిగిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ హరీష్ రావుకు ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. కనీసం ప్రాంగణంలో హరీష్ రావు ఫోటో కూడా ఏర్పాటు చేయలేదు. ఒకప్పుడు పార్టీలో ట్రబుల్ షూటర్ గా ఉంటూ.. కెసిఆర్ కు అండగా ఉండేవారు హరీష్ రావు. కానీ క్రమేపి కేటీఆర్ ప్రాముఖ్యత పెరుగుతోంది. మరోవైపు టిఆర్ఎస్ పరిస్థితి కూడా మెరుగుపడడం లేదు. వచ్చే ఎన్నికల్లో బిజెపి వైపు ప్రజలు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఏపీలో పొత్తు వర్కౌట్ కావడంతో బిజెపి తెలంగాణలో సైతం తెలుగుదేశం పార్టీతో జతకట్టే అవకాశం ఉంది. ఇటువంటి సమయంలో టిడిపిలో చేరితే రాష్ట్ర పగ్గాలు అందుకోవచ్చు. బిజెపితో కలిపి అధికారాన్ని పంచుకోవచ్చు. అందుకే హరీష్ రావు టిడిపి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## యుద్ధం ఆగింది..!

ప్రధానులతో మాట్లాడినట్టు తెలిపారు. భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, అజిత్ దోవల్‌తో చర్చలు జరిపామని వివరించారు. అటు పాక్ ఆర్మీ చీఫ్ అసిఫ్ మునీర్, పాక్ ఎన్ఎస్ఏ మాలిక్‌తో చర్చించామన్నారు. మోదీ, షరీఫ్ దౌత్య స్ఫూర్తిని చాటుకున్నారని తెలిపారు. గత రాత్రంతా జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం భారత్, పాకిస్తాన్ మధ్య తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన కాసేపటికే న్యూఢిల్లీ నుంచి భారత విదేశీ వ్యవహారాల మంత్రి మిస్రీ ధృవీకరిస్తూ ప్రకటన విడుదల చేశారు. ట్రంప్ ప్రకటన అనంతరం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు.

**భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణకు చర్చలు.. విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్**

కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాకిస్థాన్‌లు ఈరోజు ఒక అవగాహనకు వచ్చాయి. భారతదేశం అన్ని కోణాల్లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్థిరమైన రాజీలేని వైఖరిని కొనసాగించింది. అది అలాగే కొనసాగుతుందని ట్వీట్ చేశారు.

## చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం

బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి దాడులకు తెగబడ్డారని అన్నారు. సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది. చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం. ఇప్పుడు భరించేది లేదు దేశ ప్రజల భద్రతే ముఖ్యం. మతం పేరు అడిగి టూరిస్టులను చంపడం దేశ ప్రజల మనసులను కలచి వేసింది. భారతదేశ మీద జరుగుతున్న దాడికి పరిష్కారం చూపిస్తూ ఉగ్రవాదులపై దాడి చేయడం సరైన చర్య. ఇలాంటి సమయంలో దేశంలోని ప్రతీ యువతీ యువకుడు త్యాగానికి సిద్ధంగా ఉండాలి. యుద్ధానికి అవసరం పడితే అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ కూడా ముందుకు రావాలి. సైనికుల కోసం రక్తదానానికి మేము సిద్ధంగా ఉన్నాం. బార్డర్లో మనం పోరాటం చేయకపోవచ్చు కానీ సైనికులకు అవసరమైనటువంటి రక్తాన్ని, వైద్యాన్ని అందించే బాధ్యత దేశ ప్రజలపై ఉంది. సైనికుల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ఈ దేశ ప్రజలపై ఉంది. భారత సైనికుల్లారా మీరు బార్డర్లో మా కోసం పోరాటం చేస్తున్నారు మీ వెనుక 140 కోట్ల మంది భారతీయులు ఉన్నారు. మీ ధైర్యమే మాకు శక్తి, మీ నిబద్ధత మాకు గర్వకారణం, మీ పోరాటం మాకు స్ఫూర్తని అన్నారు.

## నా జీతమంతా అనాథ పిల్లలకే

ఉదారతను చాటుకుంటున్నారు. తాజాగా పవన్ కల్యాణ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని అనాథ పిల్లలకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు.తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు అండగా తన నెల వేతనాన్ని ఇచ్చేందుకు పవన్ కల్యాణ్ ముందుకొచ్చారు. ఒక్కొక్కరికీ రూ. 5వేల చొప్పున సాయం అందించనున్నారు. మిగిలిన వేతనం కూడా వారి బాగోగులకే ఖర్చు చేయనున్నారు. ప్రతి నెలా వారి ఇంటి వద్దనే అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.పదవి ఉన్నంతకాలం సాయం కొనసాగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు.పిఠాపురం నియోజకవర్గ ప్రజల సంక్షేమంతోపాటు సమస్యల పరిష్కారం తన బాధ్యత అని ఉద్ఘాటించారు. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు తన వేతనం నుంచి ఒక్కొక్కరికీ నెలకి రూ. 5 వేల చొప్పున రూ. 2,10,000 ఆర్థిక సాయం అందించారు. "పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో శాసనసభ్యుడిగా గెలిపించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధితోపాటు సమస్యలను పరిష్కరించడం నా బాధ్యత' అని చెప్పారు. "పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాలని నిర్ణయించుకున్నాను. అందులో భాగంగా నియోజకవర్గం పరిధిలోని తల్లిదండ్రులు లేని బిడ్డల భవిష్యత్తు కోసం ఆ మొత్తం ఖర్చు చేయనున్నాం. పదవి ఉన్నంతకాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తాం" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న భావనతోనే వేతనం తీసుకున్నాను.నన్ను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలో కన్నవారు దూరమైన పిల్లల భవిష్యత్తు కోసం, వారి చదువుల ఖర్చు చేయాలనుకున్నాను. ప్రభుత్వం, పదవి ఉన్నంతకాల జీతం మొత్తం అనాథ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తాను" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కులను అందజేశారు. అందుబాటులో ఉన్న 32 మందికి స్వయంగా పవన్ కల్యాణ్ చేతుల మీదుగా నగదును అందజేయగా...మిగిలిన పది మందికీ జిల్లా యంత్రాంగం ద్వారా అందజేయనున్నారు. ఇకపై ప్రతి నెలా ఈ సాయం వారి ఇళ్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

## ఆచితూచి దెబ్బ..

అయితే రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేసినా, ఏ కేసు నమోదు చేసినా అది జగన్ కు ప్లస్ గా మారి వచ్చే ఎన్నికల్లో తమకు నష్టం చేకూరుస్తుందని నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే రాష్ట్ర పరిధిలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నట్లే కనపడుతుంది. జగన్ కు ప్రధానంగా మద్యం కుంభకోణం మెడకు చుట్టుకునేలా ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. ఈ టీం మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారులను ఇప్పటికే అరెస్ట్ చేసింది. రాజ్ కసిరెడ్డితో పాటు చాణక్య, దిలీప్ ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అయితే తాజాగా ఈ మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఎంటర్ కావడమే ఇప్పుడు ట్విస్ట్. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఈడీ మద్యం కుంభకోణానికి సంబంధించిన వివరాలను అందించాలని స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను కోరినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలాది కోట్ల రూపాయలు చేతులు మారాయని, మనీలాండరింగ్ కూడా పెద్దయెత్తున జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ విచారణకు సిద్ధమయింది.

# ప్రపంచానికి తెలిసొస్తున్న భారత్ సత్తా

**అద్భుతం జరిగేటప్పుడు ఎవరూ గుర్తించలేరు, జరిగిన తర్వాత ఎవరూ గుర్తించాల్సిన పని లేదు. ఇది ఇప్పుడు నరేంద్రమోదీకి సరిగ్గా సరిపోతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు భారత్ వాయు రక్షణ, దాడి సామర్థ్యాలు ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా మార్చేశాయి. ఇదే నిదర్శనం ఆయన దూరదృష్టికి. ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత జరిగిన పరిణామాలు దేశం వాయు రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో మోదీ ప్రభుత్వం చేసిన అవిశ్రాంత కృషికి నిదర్శనంగా ఉన్నాయి.**



**ఈ క్షిపణులు భారతదేశ ఫ్రంట్‌లైన్ రక్షణలో కీలకమైన భాగంగా ఉన్నాయి. మోదీ ప్రభుత్వం స్వశక్తిపై దృష్టి పెట్టడం వల్ల ఆకాశ్ క్షిపణులు, DRDOఅభివృద్ధి చేసిన కౌంటర్ డ్రోన్ టెక్నాలజీలు వంటి స్వదేశీ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ వ్యవస్థలు భారతదేశం తన భద్రతా అవసరాల కోసం విదేశీ వనరులపై ఆధారపడకుండా చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ కేవలం రక్షణాత్మక బలం గురించి మాత్రమే కాదు. ఇది భారతదేశం శక్తి సామర్థ్యాలను కూడా ప్రదర్శించింది.**

భారత్ తన గగనతలాన్ని రక్షించుకోవడమే కాకుండా ప్రపంచ వేదికపై తన శక్తిని నిరూపించుకో గలిగింది. జాతీయ భద్రత పట్ల ప్రధానమంత్రి మోదీ అచంచలమైన నిబద్ధత ఎప్పటికప్పుడు రుజువు అవుతూనే ఉంది.:ఉగ్రమూకల భరతపట్టిన భారత్‌పై పాకిస్థాన్ రగిలిపోతోంది. అవసరం ఉన్నప్పుడు ఉగ్రకుక్కల్ని ఉసిగొల్పి పబ్బం గడుపుకోవడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారింది. ఆ దేశం తమ సైన్యం కంటే ఎక్కువగా ఉగ్రవాదులనే నమ్ముకుంటోంది. అందుకే వారి స్థావరాలను ధ్వంసం చేసిన భారత్‌పై కక్ష పెంచుకుంది. సుందరమైన ప్రదేశాలు చూసేందుకు వెళ్లిన పర్యాటకులపై ఏప్రిల్ 22న కాల్పులు జరిపారు. 26 మంది పొట్టన పెట్టుకున్నారు. దీనికి ప్రతిగానే భారత్ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. దీంతో పేట్రేగిపోయిన పాకిస్థాన్ భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు విఫలయత్నం చేస్తోంది.

భారత్‌ను దొంగ దెబ్బ తీసేందుకు అర్ధరాత్రి వేళ క్షిపణి దాడులకు యత్నించింది. కానీ పాక్ కుట్రలను ముందే తెలుసుకున్న భారత్ ఆర్మీ అన్నింటినీ సమర్థంగా తిప్పి కొట్టింది. ఇలాంటి పన్నాగాలు చేస్తుందన గ్రహించి అన్ని రక్షణ వ్యవస్థలను అలర్ట్ చేసింది భారత సైన్యం. పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టడానికి భారత వైమానిక దళంలోని S400 క్షిపణి రక్షణ వ్యవస్థ చాలా అక్కరకు వచ్చింది. మొన్న, నిన్న రాత్రి జరిగిన దాడులను సమర్థంగా ఎదుర్కోగలిగింది. పాకిస్థాన్‌కు భయాన్ని పరిచయం చేసింది. గత దశాబ్దంలో భారత్‌రక్షణ మౌలిక సదుపాయాలను వ్యూహాత్మకంగా మార్చడానికి ఆ నిబద్ధత దారితీసింది. 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి మోదీ అత్యాధునిక సాంకేతికత, వ్యవస్థలలో పెట్టుబడులపై ఫోకస్ చేసారు. దీని వల్ల భారత్ తన గగనతలాన్ని కాపాడుకోవడంలో సొంత శక్తిపై ఆధారపడగలిగింది. దీని కోసం బలమైన, మల్టీ లేయర్ వాయు రక్షణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి పెట్టింది. ఏదైనా ముప్పుకు వేగంగా పసిగట్టి కచ్చితత్వంతో రియాక్ట్ అయ్యే వాయు రక్షణ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసింది.

ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశం సాధించిన విజయానికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఇటీవల ప్రారంభించిన క్షిపణి దాడులు సమర్థవంతంగా తిప్పికొట్టాయి మనై సేనలు. భారత సాయుధ దళాలను అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలతో సన్నద్ధం చేయడంలో మోదీ ప్రభుత్వం చూపిన దూరదృష్టి కారణంగా ఇది సాధ్యమైంది. పాకిస్తాన్ ప్రయోగించిన ప్రతి క్షిపణిని అడ్డగించిన విధానం మన వద్ద ఉన్న వ్యవస్థల సామర్థ్యాన్ని చెబుతోంది. వేగవంతమైన, సమన్వయంతో రియాక్ట్ అయిన విధానం భారత్‌లో బలపడిన వాయు రక్షణకు స్పష్టమైన సూచనగా చెప్పవచ్చు.

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో ఆధునీకరణపై దశాబ్ద కాలంగా చేసిన పెట్టుబడి ఫలితంగా ఇది సాధ్యమైంది. భారతదేశ భద్రత కోసం మోదీ ప్రభుత్వ దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంది. లేటెస్ట్ వాయు రక్షణ వ్యవస్థలు, సాంకేతికతలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టింది. భారతదేశ రక్షణను బలోపేతం చేసిన కీలక కొనుగోళ్లు పరిణామాలు ఇవే:S400 ట్రయంఫ్ సిస్టమ్స్: ఈ అత్యాధునిక S400 క్షిపణి వ్యవస్థల ఐదు స్క్వాడ్రన్‌ల ఒప్పందం 2018లో జరిగింది. ₹35,000 కోట్లకు సంతకాలు జరిగాయి. ఇది ఇప్పుడు దేశ వాయు రక్షణ సామర్థ్యంలో గేమ్‌ఛేంజర్‌గా నిలిచింది. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు పని చేస్తున్నాయి. అంటే భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత అధునాతన వైమానిక రక్షణ వ్యవస్థల్లో ఒకటిగా ఉంది.బరాక్8 క్షిపణులు: 2017లో ఇజ్రాయెల్‌తో 2.5 బిలియన్ డాలర్లతో ఒప్పందం కుదిరింది. బరాక్8 మధ్యస్థశ్రేణి ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను భటిండా వంటి కీలక ప్రదేశాల్లో ఉంచింది.

ఈ క్షిపణులు భారతదేశ ఫ్రంట్‌లైన్ రక్షణలో కీలకమైన భాగంగా ఉన్నాయి. మోదీ ప్రభుత్వం స్వశక్తిపై దృష్టి పెట్టడం వల్ల ఆకాశ్ క్షిపణులు, DRDOఅభివృద్ధి చేసిన కౌంటర్‌డ్రోన్ టెక్నాలజీలు వంటి స్వదేశీ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ వ్యవస్థలు భారతదేశం తన భద్రతా అవసరాల కోసం విదేశీ వనరులపై ఆధారపడకుండా చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ కేవలం రక్షణాత్మక బలం గురించి మాత్రమే కాదు. ఇది భారతదేశం శక్తి సామర్థ్యాలను కూడా ప్రదర్శించింది. మోదీ నాయకత్వంలో భారత్ బలీయమైన రక్షణ వ్యవస్థను నిర్మించుకోవడమే కాకుండా ఆపరేషన్ నిర్వహించడంలో చూపిన కచ్చితత్వం అందర్నీ ఆశ్చర్యపరిచింది. భారత్ అభివృద్ధి చేసిన సూసైడ్ డ్రోన్‌లు ఆపరేషన్‌ను విజయవంతం చేశాయి. ఇవి కీలకమైన లక్ష్యాలపై అనుకున్నట్టుగానే దాడులు చేశాయి. ఇజ్రాయెల్‌కు చెందిన హారప్ డ్రోన్‌లు, వంటి అధునాతన క్షిపణులతో కూడిన రాఫెల్ ఫైటర్ జెట్‌లను ఉపయోగంతో భారత్ దాడి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసింది. ఈ ఆధునిక ఆయుధాలు, దళాల వేగవంతమైన సమన్వయంతో కూడిన స్పందన ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపాయి. తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి సాటిలేని శక్తిసామర్థ్యాలతో మోదీ నాయకత్వంలో భారత్ సిద్ధంగా ఉంది అనే మెసేజ్ ప్రపంచానికి వెళ్లింది.

జాతీయ భద్రతపై మోదీకి ఉన్న ఆలోచన స్వల్పకాలిక విజయాల గురించి కాదు; ఇది దీర్ఘకాలికంగా బలోపేతం కోసం, దానికి తగ్గ పునాది వేయడం గురించి. గత దశాబ్దంలో మోదీ ప్రభుత్వం పద్ధతి ప్రకారం బలమైన, సాంకేతికతతో నడిచే వైమానిక రక్షణ నెట్‌వర్క్ నిర్మించింది, ప్రమాదాన్ని ముందే పసిగట్టి భారత గగనతలానికి చేరుకునే లోపు గుర్తించడం, వాటిని టార్గెట్ చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక విజయం మాత్రమే కాదు , ఇది దేశ రక్షణ వ్యూహంలో ప్రధానమంత్రి మోదీ నింపిన మానసిక బలం, ఆలోచన విధానం. భారతదేశం ఇప్పుడు తన గగనతలాన్ని నిర్భయంగా కచ్చితత్వంతో నియంత్రించుకోగలదు. వచ్చే సవాళ్లు ఏవైనా ఉన్నా ఎదుర్కోవడానికి భారత్ కట్టుబడి ఉందని మోదీ ప్రభుత్వం నిరూపించింది.

# ఎన్టీఆర్ జిల్లాల్లో స్పోర్ట్స్ సిటీ

జయభేరి, విజయవాడ, మే 10:

విజయవాడగుంటూరు నగరాల మధ్య కృష్ణా నది తీరంలో 34వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తోన్న అమరావతి నగరంలో ఇక విజయవాడ పరిసర ప్రాంతాలు కూడా భాగం కానున్నాయి. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన భూములు ఎన్టీఆర్ జిల్లాలో రైతుల నుంచి భూముల్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో ఇక ఎన్టీఆర్ జిల్లా కూడా భాగం కాబోతోంది. కృష్ణానదిలో ఉన్న లంక భూముల్ని స్పోర్ట్స్ సిటీ కోసం సమీకరించాలని భావించిన ప్రభుత్వం తాజాగా ఆ ప్రతిపాదనలు ఉపసంహరించుకుని ఎన్టీఆర్ జిల్లాలో భూములను సమీకరించేందుకు ప్రయత్నిస్తోంది. అమరావతి పై ఫుల్ ఫోకస్ పెట్టింది ఏపీ ప్రభుత్వం. ఒకవైపు విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటూనే.. పనులు వేగవంతం చేయాలని చూస్తోంది. ఈనెల 2న ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. అటు తరువాత నిన్ననే క్యాబినెట్ సమావేశం జరిగింది. గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధానిని ముమ్మందు కదిలించలేని పటిష్ట స్థితిలోకి చేర్చాలని నిర్ణయించారు. పార్లమెంట్లో గెజిట్ విడుదల చేసి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు అమరావతి రాజధానికి అనుసంధానంగా అన్ని రంగాలను అభివృద్ధి చేయాలని కూడా భావిస్తున్నారు. అందులో భాగంగా స్పోర్ట్స్ సిటీకి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నదికి దగ్గరగా ఉన్న ఓ నాలుగు గ్రామాలను రాజధాని పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోందిఅమరావతిలో క్రీడా పరంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వంకృతనిశ్చయంతో ఉంది. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేసి ప్రపంచంలోనే గుర్తింపు సాధించేలా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్న త్రిలోచనాపురం, మూలపాడు, కోటికలపూడి, జమీమాచవరం గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో భూములు సేకరించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించారు. స్పోర్ట్స్ సిటీ కోసం ఈ నాలుగు గ్రామాలను ఎంచుకున్నారు. అంతకుముందు కృష్ణా నదిలో ఉన్న చిన్నలంక, పెదలంక దీవులను సైతం అధికారులు పరిశీలించారు. అవి వరదలకు మునిగిపోయే అవకాశం ఉండడంతో వాటిని వద్దనుకున్నారు. వాటికి దగ్గరలో ఉన్న ఈ నాలుగు గ్రామాలను తాజాగా ఎంపిక చేశారు.మూలపాడు లో ఇప్పటికే రెండు క్రికెట్ మైదానాలు ఉన్నాయి. ఈ ప్రాంతం స్పోర్ట్స్ సిటీకి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. మూలపాడు నుంచి అమరావతికి గ్రాండ్ ఎంట్రన్స్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారు. కృష్ణానది మీదుగా ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మించాలన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అందుకే ఈ నాలుగు గ్రామాలను ఎంచుకున్నట్లు సమాచారం. మూలపాడు లోనే అంతర్జాతీయ క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉంది. గురువారం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు చెప్పారు. త్వరలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం దిశగా అడుగులు పడనున్నాయి. ఈ స్పోర్ట్స్ సిటీతోపాటుగా అక్కడే దేశంలోనే అతిపెద్ద ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం ఈ నాలుగు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. వాటిని అమరావతి పరిధిలోకి తేవాలని క్యాబినెట్లో నిర్ణయం తీసుకున్నారు.

స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ అక్కడే ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రెండు వేల ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని కూడా భావిస్తోంది ఏపీ ప్రభుత్వం. విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్ని కూడా రాజధానిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.ఎన్టీఆర్ జిల్లాను కూడా అమరావతి రాజధాని పరిధిలో కలిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అమరావతి నగరానికి కనెక్టివిటీ మొత్తం విజయవాడ మీదుగానే ఉంటుంది. హైదరాబాద్ నుంచి అమరావతి చేరుకోడానికి విజయవాడ వరకు ప్రయాణించాల్సి వస్తోంది. రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూముల్లో స్పోర్ట్స్‌సిటీ కోసం ప్రత్యేకంగా భూముల్ని కేటాయించే పరిస్థితులు లేకపోవడం ప్రత్యామ్నాయాల వైపు ప్రభుత్వం దృష్టి సారించింది. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు కోసం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం మండలంలోని త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, జమీమాచవరం గ్రామాలను అమరావతి పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.ఎన్టీఆర్ జిల్లాలోని నాలుగు గ్రామాలను కూడా రాజధాని పరిధిలోకి కలిపితే కనీసం 4వేల ఎకరాలు ప్రభుత్వానికి సమకూరుతాయి. ఈ గ్రామాలు ప్రస్తుతం సీఆర్డీఏ పరిధిలో ఉన్నాయి. అమరావతి ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ఇప్పటికే ఈ భూములకు డిమాండ్ ఉంది. తాజాగా వీటిని రాజధాని పరిధిలోకి తీసుకురావాలని స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారు.అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ కోసం ఈ భూములను వినియోగిస్తారు. ఇబ్రహీంపట్నం మండలం లోని కొటికలపూడి, మూలపాడు, త్రిలోచనపురం, కేతనకొండ గ్రామాలను ప్రాథమికంగా భూ సమీకరణలో తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ గ్రామాల్లోని భూములను భూ సమీకరణలో ప్రభుత్వం తీసుకుని రాజధానిలో రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ఇవ్వాలని భావిస్తున్నారు. భూ సమీకరణ కోసం రెవెన్యూ అధికారులు నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. భూ సమీకరణ కింద భూములు ఇవ్వడానికి రైతుల నుంచి సానుకూల స్పంద వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. రైతులు తమకు ఇచ్చే ప్యాకేజీ గురించి వివరాలు కోరారు. మరో సమావేశంలో వీటిపై స్పష్టత ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు.ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ, మూలపాడు, త్రిలోచనపురం, జమీమాచవరం ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతాలన్నీ కృష్ణాతీరానికి సమీపంలో ఉండటం, ఇప్పటికే మూలపాడులో ఏసీఏ క్రికెట్ స్టేడియం ఉండటంతో ఈ ప్రాంతాలను అనువుగా భావిస్తున్నారు.మూలపాడు నుంచే కృష్ణానదిపై అమరావతికి ఐకానిక్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ ఇప్పటికే నిర్ణయించింది.హైదరాబాద్ నుంచి వచ్చే వారికి అమరావతి వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం అవుతుంది.

# డాక్టర్ల సమన్వయ లోపం వలన ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు



- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, హయత్ నగర్:**


మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని మండల ఆఫీస్ ఆవరణంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లో డాక్టర్లు ప్రజలకు సరైన సేవలు అందించడం లేదని అకస్మాత్తుగా GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి గారు హాస్పిటల్ కి వెళ్లడంతో మధ్యాహ్నం 12:00 గంటలకే సూపర్డెంట్ రూమ్ కి తాళం వేసి ఉండడం గమనియంగా భావిస్తూ హాస్పిటల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నో రోజుల నుండి చుట్టుపక్కల స్థానిక ప్రజలు, వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు, వివిధ పత్రిక మాధ్యమాలలో వారం రోజుల క్రితం నుండి డాక్టర్ల నిర్లక్ష్యమని హాస్పిటల్ లో పనిచేసే ఔట్సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధులు సరిగా నిర్వహించకుండా ప్రజలకు సరైన వైద్యం అందించడం లేదని తెలియడంతో హాస్పిటల్ లో సరైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అని విషయంపై అకస్మాత్తుగా హాస్పిటల్ లో పర్యటించడం తో హాస్పిటల్ సూపర్డెంట్ రూమ్ కి మధ్యాహ్నం 12:00 గంటల లోపే తాళం వేసి ఉండడం విడ్డూరంగా ఉందని అన్నారు.

అదేవిధంగా హాస్పిటల్లో రోగులకు అన్ని సౌకర్యాలు సరిగ్గా అందుతున్నాయా లేవా అని రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకోవడం జరిగింది.

రోజు హాస్పిటల్ సూపర్డెంట్ ఉదయం వచ్చి తన వేలిముద్రను (అటెండెన్స్) వేసుకొని వెళ్లిపోవడమే తన పనిగా నిర్వర్తిస్తున్నారని, తన సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలకు సరైన వైద్యం అందించకుండా లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆస్పత్రులకు సహాయం అందిస్తున్న కానీ ఇక్కడ మాత్రం రోగులకు సరైన వైద్యం అందించకపోవడం సరైన చర్య కాదని, సూపర్డెంట్ పై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ ఆస్పత్రిలో 30 పడకల బెడ్ల సౌకర్యం ఉండడం ఎంతో అద్భుతంగా భావిస్తూ రోగులు కూడా 28 మంది పైగా ఉన్నారు. కానీ ఉండాల్సిన 20 మంది డాక్టర్లు లేకపోగా ప్రస్తుతం 5 మంది డాక్టర్లు ఉండడం, హాస్పిటల్ ఉన్నతాధికారి సూపర్డెంట్ కి, డాక్టర్లకు ఉన్న సమన్వయ లోపం కనబడుతుందని, వెంటనే తమ సమయపాలన మార్చుకోకపోతే,ప్రజలకు మెరుగైన వైద్యం అందించకుండా వీరు వ్యవహరిస్తున్న తీరు కనబడుతుందని వెంటనే సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని హెచ్చరిస్తూ ఇలాంటి చర్య మళ్ళి కొనసాగిస్తే సహించబమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న డాక్టర్లు Dr.దుర్గ (ఫిజిషియన్), Dr.పురుషోత్తం (పీడియాటిషన్), నర్సింగ్ సిస్టర్ రిచల్,శానిటేషన్ సూపర్వైజర్ సందీప్, ఇతర డాక్టర్లు, ఫార్మసిస్టులు, సిబ్బంది, బీజేపీ నాయకులు ప్రమోద్ రెడ్డి, మోహన్ రెడ్డి, కడారి యాదగిరి యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి,ఎల్లారెడ్డి, వెంకటరమణా గౌడ్, జయతేజ, సంపత్ గౌడ్,యాదగిరి గౌడ్, శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## టపాసులు కాల్చితే జైలుకే...

**జయభేరి, హైదరాబాద్, మే 10:**

హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడంపై పోలీసులు నిషేధం విధించారు. పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చితే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు.ఈ నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలు పేలుళ్లుగా అన్వయించుకునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉంది. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసంచా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుంది.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లీ (నం. IX) సెక్షన్ 67 (సి) కింద ఆయనకు అప్పగించిన అధికారాలను వినియోగించుకుంటూ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటే బాణాసంచాపై నిషేధం విధించే అధికారం పోలీసులకు ఉంటుంది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారుఈ నిషేధం కేవలం బాణాసంచా కాల్చడంపై మాత్రమే కాకుండా, వాటి అమ్మకాలపై కూడా వర్తిస్తుంది. లైసెన్స్ ఉన్న బాణాసంచా దుకాణదారులు కూడా ఈ సమయంలో బాణాసంచా అమ్మకాలు జరపకూడదని పోలీసులు హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే వారి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు.హైదరాబాద్ నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేడుకల్లో బాణాసంచా కాల్చకుండా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## మసాజ్ ముసుగులో వ్యబిచారం

**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా మేడిపల్లి, ఆర్ టిసి కాలనీలోని షుగర్ బ్యూటీ స్పా నందు మసాజ్ ముసుగులో వ్యబిచారం జరుగుతుందని నమ్మదగిన సమాచారం మేరకు మేడిపల్లి పోలీస్ వారు AHT team తో కలిసి అట్టి మసాజ్ సెంటర్ పై రైడ్ చేయగా అందులో మసాజ్ ముసుగులో వ్యబిచారం జరుగుతుండగా అట్టి వ్యక్తులను (7 ఆడవారు, 1 మగ వ్యక్తి) పట్టుకొని కేసు నమోదు చేసి వారిని రేమండ్ కు బాధితులను హోమ్ కు తరలించనాయినాధి.

## విచ్చలవిడిగా బోర్ల తవ్వకాలు

- అడ్డుకొని ఉప్పల్ తహసిల్దార్ కార్యాలయం అధికారులు
- ఫోన్ చేసిన ఎత్తకుండా అక్రమార్కులకు వంత పాడడం శోచనీయం
- నిత్యం ఉప్పల్ భగయత్ లో అక్రమార్కుల స్వైర్య విహారం

**జయభేరి, ఉప్పల్ :**






అక్రమ బోర్ల తవ్వకందారులు అడ్డగోలుగా రెచ్చిపోతూ తమ దందా కొనసాగిస్తున్నారు. స్థానిక ఉప్పల్ భగయత్ లో నిత్యం అక్రమార్కులు రెచ్చిపోతూ అడ్డగోలుగా బోర్లతోవ్వకాలు చేపడుతున్నారు. ఎస్ ఎస్ నిర్మాణ సంస్థ పవన్ కుమార్ ఆధ్వర్యంలో అక్రమ బోరు తవ్వకం జరుగుతున్న ఇట్టి విషయంపై స్థానిక విలేకరులు ఎమ్మార్వోకు ఫోన్ చేయగ ఫోన్ ఎత్తకుండా అక్రమార్కులకు వంత పడటం శోచనీయం. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సుమారు పదిహేను వందలు అడుగులకు పైగా తవ్వకాలు జరుపుతూ ప్రకృతి ప్రళయానికి కారణమవుతున్నారు. ఈ పాపాత్ములు. వీరితో లాలూచీ పడుతున్న అధికారులు కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ జేబులు నింపుకోవడం అత్యంత దౌర్భాగ్యం. సామాన్యులకు వంద రూల్స్ చెప్పే అధికారులు ఇలాంటి అక్రమార్కుల దగ్గర మాత్రం లాలూచీ పడుతూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వీరి అవినీతి బాగోతానికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రకృతిని నష్టపరుస్తూ ఆ వైపరీత్యాలకు కారణం అవుతున్న ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి బోర్ బండిని సీజ్ చేయడంతో పాటు బోర్ వేసిన ప్రాంతాన్ని సైతం పూర్తిగా సీజ్ చేయాలని భగయత్ వాసులు కోరుకుంటున్నారు. అక్రమార్కులకు కొమ్ము కాయకుండా అధికారులు తమ విధులు నిర్వహించాలని ప్రజలు ఆశిస్తున్నారు. వెంటనే సంబంధిత అక్రమ బోర్ బండి పై మరియు బోర్ వేసిన ప్రాంతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కఠిన చర్యలు చేపట్టి మరొకరు ఈ దుస్సహాసానికి ఓడిగట్టకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు. లక్ష్మీ బోర్ వెల్స్ పై కఠిన చర్యలు చేపట్టి మరొక్క దగ్గర ఇలాంటి అక్రమ బోర్ వేయకుండా చూడాలని తహసిల్దార్ అధికారులను ప్రజలు డిమాండ్ చేశారు.

## ప్రశ్నించే గొంతును నొక్కి పెట్టేస్తారా..?

**జయభేరి, కూకట్ పల్లి :**




ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా "సాక్షి" దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ్ రెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేయడాన్ని కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ నాయకులు ఖండించారు. కెపిహెచ్బి కాలనీలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద శనివారం జర్నలిస్ట్ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని,అందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్రమ సోధాలు చేయడమే అని అన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ప్రభుత్వాలే బాధ్యతగా ఉండాలని, కక్షపూరితంగా దాడి చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం తీరుకు ప్రజలను, జర్నలిస్ట్ లను చైతన్యపరిచి మరో ఉద్యమం చేసి జర్నలిస్టుల సంఘాల హక్కులను కాపాడుకుంటామని ఐజేయు నాయకుడు, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్ అన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును నొక్కి పెట్టేస్తారా అని సాక్షి దినపత్రిక కూకట్ పల్లి జోన్ ఇంచార్జ్ పరమేశ్ అన్నారు. ఇసుక, లిక్కర్, మైనింగ్, స్కాం లు, రైతులకు మద్దతు ధర కల్పించకపోవడం ఇలా ప్రభుత్వ వరుస వైఫల్యాలను ఎండగడుతున్న సాక్షి గొంతు నొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా పోలీసులు ఇంట్లోకి చొరబడి సోదాలు చేయడం, భయపెట్టడం సాక్షి గొంతు నొక్కే ప్రయత్నం అని అన్నారు.

**రాజకీయ కక్ష సాధింపు లో జర్నలిస్టుల ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికి ఉందని దానిని నొక్కిపెట్టకూడదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా జర్నలిస్టుల ఇంటిపై పోలీసులు వెళ్లడం ఖండిస్తున్నామని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, లేదంటే విద్యార్థి సంఘాలు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు దయ సాగర్, శ్రీనివాస్ గౌడ్, మాణిక్ రెడ్డి, రాహుల్, నాగరాజు, ప్రవీణ్, సాగర్ రెడ్డి, మారుతి సాగర్, రామ్, నవీన్, రమేష్, నరసింహ రావు, వెంకటేష్, రామారావు, పలు పార్టీ ల నాయకులు ఐస్ క్రీమ్ వెంకట్ రెడ్డి, శివా రెడ్డి, జొన్నల శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు దిలీఫ్, అశోక్ గౌడ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయ చెక్కు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర

**జయభేరి, గోరికొత్తపల్లి:**

బిఆర్ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త కీ.శే జక్కుల శ్రీనాథ్ కుటుంబానికి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి. బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి ప్రమాదపు శాత్తు మరణించిన గోరికొత్తపల్లి మండలం, ఇజ్జయ్యపల్లి గ్రామ వాస్తవ్యుడు కీ.శే జక్కుల శ్రీనాథ్ కి బిఆర్ఎస్ పార్టీ తరుపున వచ్చిన రూ. 2,00,000/ సభ్యత్వం చెక్కును శ్రీనాథ్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం లక్ష్యం



**జయభేరి, హైదరాబాద్ :**

భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్నఉద్రిక్త పరిస్థితులు హైదరాబాద్ నగరం లోనూ ప్రతిధ్వనిస్తున్నాయి. సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో, నగరంలో ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరపోలీస్ కమిషనర్ సీ.వీ. ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు.తక్షణమే నగరంలో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దుల్లోని పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నందున, నగరంలో బాణాసంచా కాల్చడం వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగే అవకాశం ఉందని సీపీ సీవీ ఆనంద్భావించారు. బాణాసంచా శబ్దాలు పేలుళ్ల శబ్దాలను పోలిఉండటంతో, ఇది ప్రజల్లో అనవసరమైన గందరగోళానికి దారితీయవచ్చు. శాంతిభద్రతలను కాపాడటం, ప్రజల్లోభద్రతా భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ నిషేధాజ్ఞలుజారీ చేశారు.

## భారత దేశం అన్ని రంగాలలో విజయం సాధించాలి



**జయభేరి, ఎల్బీనగర్ :**

భారత దేశ సైనికులకు శక్తి నివ్వాలని, నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాలలో విజయం సాధించాలని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి. బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి భారతదేశ సైనికులకు శక్తినివ్వాలని, భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో విజయం సాధించాలని వారికి ఎలాంటి అడ్డంకులు రావద్దని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రదీప్ రెడ్డి, శంకరయ్య గౌడ్, శ్రీధర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బిక్షపతి సేటు, కసిరెడ్డి, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మూర్తి, నరసింహారెడ్డి, నందకిషోర్, మహిపాల్ రెడ్డి, భద్రారెడ్డి, సురేష్ కుమార్, మహిళా సభ్యులు దేవిక, మాధవి, విజయ వైజయంతి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధియే ప్రభుత్వ ధ్యేయం



**జయభేరి, తుర్కపల్లి :**

గ్రామాల అభివృద్ధియే ప్రభుత్వ ధ్యేయమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం ధర్మారం కర్షల గడ్డ తండా నుండి బిలియా నాయక్ తండా వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతవాసులు ఎన్నో రోజుల నుండి కలలు కంటున్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం వస్తున్నాయా అని మహిళలను అడిగారు. ఈ సందర్భంగా సన్నబియ్యం వస్తున్నాయి. చాలా బాగున్నాయని మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్, జిల్లా ఓబీసీ కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య ,మండల ఉపాధ్యక్షులు రాజారాం నాయక్, బొత్త రాములు, పనిగట్ల సుదర్శన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామగొని వెంకటేష్ ,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంకని వెంకటేష్, మండల యూత్ అధ్యక్షుడు వల్ల రమేష్ ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సోన్నాయిల రఘు, నాయకులు గడ్డమీది నిఖిల్, పాంగల బాలకృష్ణ, గురు శ్రీశైలం, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



## నూతన ఆలయ నిర్మాణానికి విరాళం

- BRS నాయకులు వడ్త్య రమేష్ నాయక్

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం తెల్లదేవర్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించనున్న రామాలయం, శివాలయం, ఆంజనేయ స్వామి నూతన ఆలయం నిర్మాణానికి తన వంతు సహాయంగా BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ 1.50.000/ (ఒక లక్ష యాభై వేల రూపాయలు) విరాళం ఇవ్వడం జరిగింది రమేష్‌నాయక్‌ను కమిటీ సభ్యులు శాలువతో సన్మానం చేసినారు. ఎక్కడ నూతన ఆలయాలు నిర్మాణం జరిగిన రమేష్‌నాయక్ తన వంతు సహాయం చేసి దాంట్లో ముందుంటాడని కమిటీ సభ్యులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర జైపాల్ రెడ్డి, కేతావత్ లక్ష్మ నాయక్, బాలు నాయక్. మహా లక్మయ్య, కిన్నెర హరికృష్ణ, చంద్రయ్య, అచ్చాలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షులు రాము నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ తుల్చమ్మ కుంట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో భారత్ పాకిస్తాన్ యుద్ధంలో భారత్ విజయం సాధించాలి అని పూజలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్ బీజేపీ రాష్ట్ర SC మోర్చా ఉపాధ్యక్షులు అంకురి నరసింహ మాట్లాడుతు.. ఆపరేషన్ సింధు భారత్ పాకిస్తాన్ కి జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధిస్తుంది.పాకిస్తాన్ హిందువుల పై దాడులను ఖండిస్తూ మరో చత్రపతి మన భారత్ ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్ ఉగ్రవాదులను యమలోకానికి పంపుతున్నాడు అదేవిధంగా భారత్ ఆర్మీ కి కూడా శ్రీ ఆంజనేయ స్వామి అండగా ఉండి అనారోగ్యాలకు గురికాకుండా ఉండాలి అని కోరుకుంటూ.పాకిస్తాన్ పద్ధతి ఇలాగే ఉంటే మ్యాప్ లో పాకిస్తాన్ కనపడకుండా చేస్తుంది మన భారత్ ఆర్మీ అదేవిధంగా భారత్ లో ఉంటూ పాకిస్తాన్ కి సపోర్ట్ చేస్తున్న వ్యక్తులను భారత్ నుండి తరిమి కొడతాం. ఈ సందర్భంగా తెలియజేస్తునం ఇట్టి కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గుండాల అంజన్న, అంజి నాయక్, చండేశ్వర్ రెడ్డి శంకర్ తిరుపతి,బొడ్డుపల్లి అంజి, రవీందర్,రవి, జైరామ్, శంకర్, శ్యామ్, లక్ష్మణ్, గణేష్, వినోద్, లచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక డిజిటల్ సభ్యత్వ కార్డులు



**జయభేరి, నేరేడుముగొమ్ము :**

తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య. నేరేడు గోమ్ము మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ క్రియాశీలక డిజిటల్ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ శాఖలు వేయడం జరిగింది రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పూర్వ వైభవం రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నేరేడుగొమ్ము సీనియర్ నాయకులు బోడ ధనయ్య యాదవ్, వెంకటయ్య, నేవావత్ వెంకటి, కుంభం యాదయ్య, కటుకురి శ్రీను, గడ్డం చిన్న వెంకటయ్య, గంట చిన్న వెంకటయ్య, పంబల శివ, బోడ అజయ్, బోడ రాకేష్ కుమార్, బోడ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు త్వరతగతిన పూర్తిచేయాలి



**జయభేరి, డిండి :**

డిండి మండలంలోని వావిలికోల్ వడ్డెర గూడెం నుండి బ్రాహ్మణపల్లి బిటి రోడ్డును వీలైనంత త్వరగా పూర్తి చేయాలనీ డిండి మండల బిఆర్ఎస్ నాయకులు ఓర్సు ముత్యాలు సంబంధిత అధికారులను కోరారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రజలు రైతులు వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్లాలంటే ఎన్నో అవస్థలు పడి,కంకర పోసి వదిలేసిన రోజుల్లో వాహనదారులు కింద పడిన సందర్భాలు ఉన్నాయని, ఇప్పటికి కంకర డస్ట్ పోసారని అదికూడా బ్రాహ్మనపల్లి వరకు పూర్తి చేయలేదని అన్నారు.వీలైనంత త్వరగా కంకర, డస్ట్ పోసి బిటి రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా సంభంధిత అధికారులు కాంట్రాక్టర్ తో మాట్లాడి ప్రజలు బిటి రోడ్డును అందుబాటులోకి తేవాలని ముత్యాలు కోరారు.

# విడినా మహిళ హత్య మిస్టరీ

- 24 గంటల్లో చేధించిన గజ్వేల్ పోలీసులు
- మృతురాలి నుండి బంగారం, వెండి వస్తువులు, డబ్బులు దొంగతనం

**జయభేరి, గజ్వేల్, మే 10 :**



మహిళను హత్య చేసి బంగారం, వెండి వస్తువులు దొంగలించిన కేసులో నిందితురాలుని 24 గంటల్లోపు పట్టుకుని అరెస్టు చేశారు గజ్వేల్ పోలీసులు. క్రైమ్ నెం. 190/2025, U/s 333, 307, 103(1) నిందితురాలి వివరాలు.. రజియా అలియాస్ @ హసీనా(46), భర్త మహ్మద్ ఇస్మాయిల్, సంగపూర్ రోడ్, గజ్వేల్ పట్టణం వ్యక్తి. మునుపటి కేసు: 91/2024 U/s 370, 370(A) IPC, PITA చట్టం 3, 4. కేసు వివరాలు గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి తెలియపరుస్తూ గురువారం రాత్రి 21:00 గంటలకు పిర్యదిదారుడు గడియారం నాగరాజు, ముత్యాలు (40), రహిమత్ నగర్, గజ్వేల్, తన తల్లి గడియారం బాలమణి (62)ను ఆమె నివాసంలో హత్య చేసి బంగారు చెవిపోగులు, వెండి కాళ్ళ కడియాలు దొంగిలించారని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగింది. కేసు పరిశోధనలో భాగంగా నూతన టెక్నాలజీ, సీసీ కెమెరాలు ఉపయోగించి కేసు పరిశోదన ప్రారంభించారు. నేరస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం దగ్గర రెండు విరిగిన గాజులు లభించాయి.

CCTV ఫుటేజ్, ప్రత్యక్ష పరోక్ష సాక్షాదారాల ప్రకారం పై నిందితురాలుని శనివారం అదుపులోకి తీసుకొని విచారించగా మృతురాలు బాలామణి నేరస్తురాలికి గత సంవత్సరం క్రితం సంగాపూర్ లోని కళ్ళు కాంపౌండ్ లో పరిచయం ఏర్పడింది.

తరువాత నిందితురాలికి డబ్బులు అవసరం అయినప్పుడల్లా మృతురాలి వద్ద నుండి డబ్బులు తీసుకునేది. గత నెల రోజుల క్రితం ఆమెకు ఆమె చిన్న కోడలు సరిత అలియాస్ వాణి తో గొడవ జరగగా ఆమె కొడుకు గడియారం నాగరాజు కోడలు తన ఇద్దరు పిల్లలతో సహ ఇల్లు ఖాళీ చేసి దగ్గర్లో రూమ్ కిరాయికి తీసుకొని ఉంటున్నారని, మృతురాలు ద్వారా తెలుసుకొని, రెండు మూడు సార్లు మృతురాలు ఇంటి దగ్గరికి కల్లు తీసుకొని వెళ్లి అక్కడే ఇద్దరం త్రాగేవారు.

ఆ క్రమంలో మృతురాలు యొక్క ఒంటిపై బంగారు చెవి కమ్మలు, వెండి కాళ్ళ కడియాలు, డబ్బులు ఉండడం నిందితురాలు గమనించింది. ఆ తరువాత దురుద్దేశంతో మృతురాలు ఒక్కతే ఇంటిలో ఉంటున్నదని తెలుసుకొని, ఆమెను చంపి ఆమె వద్ద ఉన్న బంగారం, డబ్బులు దొంగలించలనే దురుద్దేశంతో ఈనెల 08న మధ్యాహ్నం సుమారు 3:30 గంటలకు నిందితురాలు, మృతురాలు వద్దకు వెళ్లి ఆమెను మాయమాటల్లో పెట్టి ఆమె మెడలో ఉన్న పసుపు దారంతో గట్టిగా ఆమె వెనక నుండి గుంజి చంపేసి, ఆమె బంగారు చెవిపోగులు, వెండి కాళ్ళ వెండి కడియాలు దొంగిలించిందని పై నేరం ఒప్పుకుంది.

పై నిందితురాలి వద్ద నుండి బంగారు చెవిపోగులు, వెండి కాళ్ళ కడియాలు స్వాధీనం చేసుకుని నిందితురాలను అరెస్టు చేసి జ్యుడిషియల్ డిమాండ్ కు పంపించడం జరిగిందని గజ్వేల్ ఏసిపి తెలిపారు. హత్యా జరిగిన 24 కేసులో గంటల్లో కేసులు చేదించిన గజ్వేల్ ఇన్స్పెక్టర్లు సైదా, అడిషనల్ ఇన్స్పెక్టర్ ముత్యం రాజు, తొగుట సిఐ లతీఫ్, ఏఎస్ఐలు ఒమెర్, యాదగిరి, సిబ్బంది వెంకన్న, వెంకటేష్, రవి, నరేందర్, స్వామి, దివ్యలను, గజ్వేల్ ఏసిపి అభినందించి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సిద్దిపేట్ అనురాధ చేతుల మీదుగా రివార్డు అందజేస్తామని తెలిపారు.

## గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టామహోత్సవం

**జయభేరి, గజ్వేల్, మే 10 :**



గజ్వేల్ నియోజకవర్గం జగదేవ్ పూర్ మండలం అలిరాజ్ పేట గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి, శ్రీతలాదేవి, నాభిషిలా, శ్రీ రేణుకాదేవి నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని నాభిషిలకు ఆడపడుచులందరు అభిషేకం చేశారు. అలాగే అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ దేవతల అనుగ్రహముతో అందరూ బాగుండాలని కోరుకుంటూ, నూతన దేవుతా విగ్రహ ప్రతిష్టా వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మవారి కరుణాకటాక్షాలు ఉంటాయని, మూడు రోజులుగా పోచమ్మ తల్లి, శ్రీతలదేవి, నాభిషిలా, శ్రీ రేణుకాదేవి వేడుకలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ ప్రేజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బిగ్ బాస్ 7 విజేత పల్లవి ప్రశాంత్, గ్రామపెద్దలు కొందండం ధర్మ రెడ్డి, తాజామాజీ సర్పంచ్ లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, తాజా మాజీ ఎంపిటిసి రమ్య రవి గ్రామ బిఆరెస్ ప్రెసిడెంట్ బాపురెడ్డి, కొందండం శ్రీనివాస్ రెడ్డి, ఏళ్ళు రామ్ రెడ్డి, రాం చెంద్రరెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ఏనుగుల సత్తి రెడ్డి, ఎస్ బాపు రెడ్డి, రాచమల్ల కిష్టయ్య, ప్రముఖ సినీ హీరో అనిల్ మొగిలి గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- నాగ పత్రిష్ట చేసి మొక్కు తీర్చుకున్న మైనం పల్లి హనుమంత రావు

**జయభేరి, గజ్వేల్, మే 10 :**



గజ్వేల్ మండలం దిలాల్పూర్ లోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శనివారం మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా నాగ ప్రతిష్ట చేశారు. గత ఏడాది లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం శనివారం ఆలయ ప్రాంగణంలో నాగ ప్రతిష్ట చేసి మొక్కు తీర్చుకున్నారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో తిరుమల రఘునాథ చార్యులు వైదిక నిర్వహణలో ప్రతిరోజు ఆలయంలో పురుషసూక్త సహిత మూలమంత్ర హవనములు నిర్వహిస్తున్నారు. ఆదివారం సుదర్శన హోమం, లక్ష్మీ నరసింహ స్వామికి శతకటాభిషేకం, చక్రస్నానం అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.



సాయంత్రం స్వామివారి పుష్ప రథోత్సవం ఘనంగా జరగనుంది. ఆదివారం జయంతిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బురుజు కింది సంతోష్ రెడ్డి, కోశాధికారి అత్తెల్లి రాజేశం గుప్త, కార్యదర్శి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి రాజిరెడ్డి, కొండల్ రెడ్డి,ముత్యం రెడ్డి, రవీందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, రాష్ట్ర సర్పంచ్ ఫోరమ్ ల రాష్ట్ర కన్వీనర్ చిట్కుల్ మైపాల్ రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాడిపల్లి రఘు వర్ధన్ రెడ్డి, ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, కొమ్ము విజయ్ కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇక్బాల్, అనిల్ రెడ్డి, కృపానందం, రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, కప్ప భాస్కర్, నాయిని తిరుపతి, ప్రవీణ్, జూనీ, రాజు, రవి గౌడ్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## నెల్లూరు ఎంఎస్ఎంఈ పార్కుకు సింధూర్ పేరు

**జయభేరి, నెల్లూరుమే 10 :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గం అమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాప చేశారు. ఈ పార్కుకు భారత్ సిందూర్ ఎంఎస్ఎంఈ పార్క్‌గా నామకరణం చేశారు. సీఎం చంద్రబాబు సూచన మేరకే ఈ పేరు పెట్టినట్టు ఆయన చెప్పుకొచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడులకు భారత్‌లో బయపడేవాళ్లు ఎవరూ లేరని.. పాక్ దాడులను భారత్ సమర్ధవంతంగా ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. భారత మహిళల సిందూరాన్ని చేరిపేయడానికి ప్రయత్నించిన పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బుద్ధి చెప్పిందన్నారుభారత్‌పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలను యావత్ ప్రపంచం నిశితంగా పరిశీలిస్తోందని.ధర్మ పోరాటం చేస్తున్న భారత సైన్యానికి మోరల్ సపోర్ట్ కోసం ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో 60 ఎకరాల్లో ఈ MSME పార్కు పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. భవిష్యత్‌లో దీన్ని మరింత విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఈ పార్కు ఏర్పాటుతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పదివేల మందికిపైగా ఉపాధి అవకాశం లభిస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పార్కు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా భారత్ సిందూర్ ఎంఎస్ఎంఈ పార్క్‌గా నామకరణం చేసినట్టు ఆయన తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకున్న వారికి 48 గంటల్లోనే అన్ని అనుమతులు వస్తాయని ఆయన అన్నారు.

## ఏపిలో కొత్త విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నాం

- రామ్మోహన్ నాయుడు



**జయభేరి, అమరావతి మే 10:**

కనెక్టెడ్ ఆంధ్రప్రదేశ్' కలను ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చేందుకు కొత్త విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ నుంచి బెంగళూరుకు జూన్ 2 నుంచి ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విమానాలు నడుస్తాయని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం నుంచి బెంగళూరుకు సులువుగా చేరుకోవచ్చునని, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. విమాన సర్వీసులు జూన్ 13 నుండి ప్రారంభమవుతాయని.. ఈ విమానాలు వారానికి నాలుగురోజులు నడుస్తాయని అన్నారు. యూఏఈ, ఇతర దేశాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# రైతులకు చేదు ఇచ్చిన మామిడి



జయభేరి, మహబూబ్ నగర్, మే 10:

మధుర ఫలమైన మామిడి, రైతులకు చేదు ఫలాన్ని ఇచ్చింది. తలెత్తుకునేలా చేస్తుందనుకున్న ఫలరాజు వాళ్ల కుత్తుకలపై అప్పులకత్తిని తెచ్చిపెట్టింది. ఫిబ్రవరి నెలలోనే ప్రతికూల వాతావరణంతో పూత, పిందెలు రాలిపోగా, మిగిలిన కాయలు ఇప్పుడు వడగండ్ల వానతో నేలపాలయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 13,468 ఎకరాల్లో మామిడి తోటలు సాగు కాగా, అందులో 1200 ఎకరాలు ఈదురు గాలులు, వడగండ్లతో ధ్వంసమయ్యాయిఅధికారులు పెట్టుకున్న దిగుబడి అంచనాలు తలకిందులయ్యాయి. 40,404 టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుందనుకుంటే, 16,161 టన్నులే చేతికొచ్చాయి. రైతులు సుమారు రూ.85లక్షల ఆదాయాన్ని కోల్పోయారు. వచ్చిన కొద్దిపాటి మామిడి కాయలను అమ్ముకుందామంటే మార్కెట్ సౌకర్యం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి, హిమాయత్, అల్ఫన్సా, సువర్ణరేఖ, నీలం, దశేరి, రసాలు వంటి మామిడి రకాలు ఉత్పత్తి అవుతుంటాయితెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సగటున 43.8 టన్నుల మామిడి దిగుబడికి జిల్లా ఊతంగా నిలుస్తోంది. సాధారణంగా ఏటా మార్చిలో మొదలయ్యే మామిడి సీజన్ జూన్ వరకూ సాగుతుంది. అందులో ఏప్రిల్, మే నెలల్లో మామిడి మార్కెట్ కళకళలాడుతూ ఉండేది.

అయితే ఈ సారి పరిస్థితి అలా లేదు. కాసిన కొద్దిపాటి కాయల్లో సగానికిపైగా వడగండ్ల వానతో నేలరాలిపోయాయి.ఎకరానికి 3.5 టన్నుల మామిడి దిగుబడి అంచనాకు 1.5 టన్నుల పంటే వచ్చింది. కొందరు రైతులు కాయలను చెట్లకే వదిలేశారు. జిల్లా నుంచి కొత్తపేట మార్కెట్ తో పాటు రంగారెడ్డి జిల్లా కోహెడ, వరంగల్, జగిత్యాల జిల్లా కోరుట్ల మార్కెట్లకు మామిడిని తరలిస్తుంటారు. అక్కడ మార్కెట్లో చాలా వరకూ అమ్ముడుపోగా, మిగిలిన సరకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతుంది.ఇప్పటికే కొన్ని రకాలు కోతకొచ్చినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఏం చెయ్యలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరి తోటల్లో కాయలు దాదాపుగా పక్వానికి వచ్చి చెట్లకే పండిపోతున్నాయి. ?మామిడి తోటలను గుత్తకు తీసుకున్న సంతోషం సగం పంట వడగండ్లతో నాశనం కావడంతో ఆవిరైంది. ఇప్పుడు కరోనా కారణంగా పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయాం.ఎలా గట్టెక్కాలన్నది మాకు అర్థం కావడం లేదు.' అంటూ హుస్నాబాద్, అక్కన్నపట, కోహెడ మండలాల్లో తోటలను లీజుకు తీసుకున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టినట్టు వారు చెబుతున్నా కొందరు రైతులు ఇంకా తమకు డబ్బులు ఇవ్వలేదంటున్నారుజిల్లాలో మామిడి రైతులు తమ పంటను మార్కెటింగ్ చేసుకోవడానికి అనేక ఆటంకాలున్నాయి. మామిడిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన ప్రభుత్వ కోల్డ్ స్టోరేజీలు లేవు. ప్రయివేటు కోల్డ్ స్టోరేజీలు రెండు ఉన్నాయి. ఒకటి సిద్దిపేట, మరొకటి ములుగులో ఉంది. బడా కాంట్రాక్టర్లే వీటిని వినియోగిస్తున్నారు. మామిడి రైతులు, ఎగుమతిదారులు, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీలో ఉన్న వేలాది మంది ఆందోళనలో ఉన్నారు.ఏం జరుగుతోందో తెలియక సతమతం అవుతున్నారు.

ప్రభుత్వమే మామిడి దిగుబడిని కొనుగోలు చేసి అమ్మకాలు చేపట్టాలని ఎప్పటి నుంచో రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న కమలాలు, యాపిల్స్ వంటి వాటి కొనుగోళ్లకు ఇక్కడి మార్కెట్లో ఆటంకాలు లేవని, ఇక్కడ పండిస్తున్న మామిడికి మార్కెట్ లేకపోవడం బాధకరమంటున్నారు.ప్రభుత్వాల ప్రకటనలకు చేతలకు పొంతన ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ మంత్రి హరీశ్ రావు బెనిషాన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని మామిడికాయలను కొనుగోలు చేస్తామని ప్రకటించారు.

నంగునూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఈ విషయాన్ని చెప్పారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్న తరుణంలో కోల్డ్ స్టోరేజీలు ఉంటే రైతులకు ఇంత నష్టం ఉండపోవని చెబుతున్నారు. మామిడితో పచ్చళ్లు పెద్ద స్థాయిలో తయారుచేస్తూ ఉంటారు. ఏటా ఈ సీజన్‌లో పచ్చళ్లు తయారు చేసి, మిగిలిన కాలమంతా దేశంలోని వివిధ ప్రాంతాల్లో అమ్మకాలు సాగించేవారు అనేకమంది ఈ జిల్లా గడ్డ మీద ఉన్నారు. ఆంధ్రులు పెంపొందించిన ఆవకాయతో అనుబంధం ఉండనే ఉన్నది. మామిడి తాండ్ర పరిశ్రమ కూడా జిల్లాలో అక్కడక్కడా మొదలవుతోంది. ఇక మామిడితో జామ్ వంటి ఇతర ఉత్పత్తులు కూడా ఉన్నాయి.



## ఘనంగా శనిత్రయోదశి వేడుకలు


- అమ్మవారిని దర్శించుకొని తిలతైలాభిషేకం చేసిన భక్తులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన న్యాయమూర్తి స్వాతి

జయభేరి, వర్గల్ మే 10 :

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో శనివారం శని త్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శని త్రయోదశి మహోత్సవానికి అంకురార్పణ చేయగా, అనంతరం విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీ శనైశ్చర స్వామి వారికి తిల తైలాభిషేకం చేశారు. కాగా కుంభం, మీనం, మేషం, ధనుస్సు, సింహ రాశుల పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు. అలాగే గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి స్వాతి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు తైలాభిషేకం చేశారు. అంతేకాకుండా భక్తులు శ్రీ విద్యాధరి, శ్రీ శనీశ్వర, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర, శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర క్షేత్రాలను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.



## అనకాపల్లి జిల్లాలో క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం




జయభేరి, అనకాపల్లి:

జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆటో డ్రైవర్లు మరియు స్థానిక ప్రజలకు కొత్తగా అమల్లోకి వచ్చిన భారత క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించే సమావేశం పోలీస్ శాఖవారు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కొత్త చట్టాల ముఖ్యాంశాలు, వాటి అమలు విధానం, ప్రజలకు వచ్చే లాభాలు మరియు నిర్లక్ష్యంగా ఉల్లంఘనచేసినట్లయితే ఎదురయ్యే శిక్షలు మొదలైన అంశాలపై వివరంగా చర్చించబడింది. ముఖ్యంగా రోడ్ రూల్స్, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, మైనర్ల రక్షణ, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.కొత్త చట్టాల ద్వారా సాధారణ ప్రజలకు రక్షణ పెరుగుతుంది. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు కట్టుబడి ఉండాలి. అందరూ చట్టాలకు లోబడి క్రమశిక్షణతో ప్రవర్తిస్తే సమాజం మరింత సుస్థిరంగా మారుతుంది అని తెలిపారు.

## విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

- ఎం ఈ ఓ నాగేశ్వరరావు




జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని కొండమల్లేపల్లి మండల ఎంఈఓఆర్ నాగేశ్వరరావు అన్నారు. కేఎంపీ హెల్పింగ్ హాండ్స్, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉంటారని ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉంటున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మేము కూడా ప్రభుత్వ పాఠశాలలనే చదువుకున్నామని అన్నారు. ఇకముందు ఉన్నత విద్యలు అభ్యసించి ఉన్నత శిఖరాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన జే సహస్ర ఎస్సీ గురుకుల 574, ఆర్ అనూష ఎస్టి గురుకుల 570, బొడ్డుపల్లి స్పందన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 561 ,ఎం దివ్య బీసీ గురుకుల 551, ఈ రూప కేజీబీవీ 476, ఎస్ స్వాతి చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 438 సాధించిన విద్యార్థినిలకు బ్యాగులు పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊట్కూరు వేమన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి ,మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు ఘనపురం వెంకటేశ్వర్లు, లాలూ నాయక్, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కూన భానుచందర్, కొలనుపాక యుగేందర్, సురేష్ ,దండు రవికుమార్, భూతరాజు భరత్, అంజి, అలుగువెల్లి నాగార్జున రెడ్డి ,బొడ్డుపల్లి ముత్యాలు, శివ తదితరులు పాల్గొన్నారు.



## చర్చనీయంగా జగన్ కామెంట్స్

జయభేరి, గుంటూరు, మే 10:

ఎక్కడ ఉన్నా.. ఎవ్వర్నీ వదలబోం.. పార్టీ నాయకుల సమావేశంలో జగన్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా వైసీపీ సానుభూతిపరులను ఇబ్బంది పెడుతున్న పోలీసుల పేర్లు రాసిపెట్టండి అని జగన్ చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది'మన కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి.. ఎవ్వరినీ వదలం.. సప్త సముద్రాల అవతల ఉన్నా విడిచిపెట్టం.. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదాం' అని వైసీపీ చీఫ్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కామెంట్‌స్‌పై ఇప్పుడు ఏపీ పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'కేవలం వైసీపీని ప్రేమించినందుకు, పార్టీని అభిమానించినందుకు.. కార్యకర్తలు పడుతున్న బాధను చూశాను. అందుకే జగన్ 2.0 లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తా. ఈరోజు చంద్రబాబు, పోలీసులు చేస్తున్నది దుర్మార్గం. వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో.. రేపు అదే పెరుగుతుంది. అందుకే ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు.. ఆరోజు ఎక్కడున్నా, రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టం.. అది మామూలుగా ఉండదు' అని జగన్ వార్నింగ్ ఇచ్చారు.'ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను చూశాక నేను ఒకటే చెబుతున్నాను.. ఇప్పుడు బాధపడుతున్న కార్యకర్తలకు పూర్తి న్యాయం చేస్తాను. ఈరోజు తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు. సంబంధం లేకున్నా కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు గతంలో ఏనాడూ చూడలేదు. చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడంటే.. ఆయన ప్రజల్లో చులకన అయ్యారు. హామీలు అమలు చేయడం లేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. కాబట్టి, ఎవరూ ప్రశ్నించకూడదని, రాష్ట్రంలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నాడు' అని జగన్ వ్యాఖ్యానించారు'ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా, వెంటనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఒకరోజు తిరుపతి లడ్డూ అంటారు. ఇంకోరోజు సినీ నటి కేసు అంటారు. చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే.. ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోము' అని జగన్ స్పష్టం చేశారు.జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు.. అటు రాజకీయ నాయకుల్లో.. ఇటు పోలీసు వర్గాల్లో చర్చకు దారితీశాయి. గతంలో కూడా జగన్ కొందరు పోలీసు అధికారుల పేర్లు చెప్పిమరీ వార్నింగ్ ఇచ్చారు. కానీ.. నేరుగా పేర్లు రాసిపెట్టండి.. తర్వాత వాళ్ల సంగతి చెబుదాం అని ఎప్పుడూ అనలేదు. దీంతో పోలీసుల్లో జగన్ కామెంట్‌స్‌పై చర్చ జరుగుతోంది.

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి పిలుపు


జయభేరి, పరవాడ:




పరవాడ మండలంలో ఫార్మా సిటీలో శనివారం కార్మికులతో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు , రైతులకు గిట్టుబాటు ధర డిమాండ్లతో జరగబోవు మే 20వ తేదీ సమ్మెలో కార్మికులు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని గని శెట్టి పిలుపునిచ్చారు. శనివారం ఫార్మా సిటీలో జరిగిన సమావేశంలో గని శెట్టి మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వల్ల సమ్మె చేసే హక్కు , సంఘం పెట్టుకునే హక్కు, పనిగంటలు పెంచడం, పారిశ్రామిక వివాదాలు చట్టానికి తూట్లు పోడవటం వంటి అనేక దుర్మార్గమైన విధానాలు ఈ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించకుండా తిప్పుకొట్టాలని కార్మికులకిగనిశెట్టి పిలుపునిచ్చారు. అందుకే మే20న దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని దీనిలో కార్మికులు, రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, జి చిట్టిబాబు, సత్తిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పల్లెలు కోసం యాప్

జయభేరి, హైదరాబాద్, మే 10:



గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా స్వచ్ఛ పల్లెలే లక్ష్యంగా సరికొత్త యాప్‌ను రూపొందించింది.తద్వారా చెత్త సేకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుంది. ఎన్ని చర్యలు చేపట్టినా పంచాయతీల్లో చెత్త సేకరణ సరిగా ఉండకపోవడం, డంపింగ్ యార్డులతో పంచాయతీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పెంచే దిశలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కార్యాచరణను రూపొందించారు. దీంతో చెత్త సేకరణ పర్యవేక్షణ కోసం ప్రత్యేక యాప్ ను రూపొందించారు. వారం, పది రోజుల్లో ఈ యాప్ అందుబాటులోకి రానున్నది.ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు పీఎస్ యాప్ అందింది. ఆ యాప్‌లో పంచాయతీ ల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారా న్ని పొందుపరుస్తున్నారు. ప్రతి రోజు కాలువలు, వీధులు, ఇన్ స్టిట్యూషన్లను శుభ్రపరి చే సమాచారం, ఫొటోలను చేరుస్తున్నారు.ఇప్పుడు అదే యాప్‌లో మరో ఆప్షన్‌ను ప్రభుత్వం చేర్చింది. ఆ ఆప్షన్ ద్వారా ప్రతిరోజు గ్రామంలో ఎన్ని నివాసాల నుంచి చెత్త సేకరించారు. ఎంత మేర చెత్త పోగయ్యింది. అందులో తడి చెత్త, పొడి చెత్త ఎం త వంటి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయనున్నారు.యాప్‌లో అప్‌లోడ్ చేసిన సమచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. సేకరించిన చెత్తను ఎక్కడో ఒక చోట డంప్ చేయకుండా చర్యలుతీసుకోనున్నారు. తడి చెత్తను 60 రోజులో ఎరువుగా మార్చాలి, కేజీ పొడి చెత్త 60 రోజుల్లో 150 గ్రాముల ఎరువుగా మారుతుంది.ప్లాస్టిక్, సీసాలు వంటి పొడి చెత్తను ప్లాస్టిక్ డిస్పోస్ కేంద్రాలకు తరలించడం లేక అమ్మేయడం చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో డంప్ చేయకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఒక్కో వ్యక్తి కనీసం 100 గ్రాముల చెత్తను జనరేట్ చేస్తారని అంచనా.దానికనుగుణంగా ఆయా గ్రామాల్లో అంత మేర చెత్త సేకరణ జరగకపోతే పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేనట్టుగా గుర్తిస్తారు. అలాంటి సందర్భంలో పంచాయతీ కార్యదర్శిని అప్రమత్తం చేసి, చెత్త సేకరణ ప్రక్రియను మెరుగుపరిచేలా అధికారులు ఆదేశాలిస్తారు. యాప్ ద్వారా నిత్యం చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించడం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛదనం పెరుగనున్నది.



# అనసూయనా.. టీనేజ్ పిల్లనా?


## కుర్రాళ్ళ చూపంతా అక్కడే..

**మరింత గ్లామరస్ గా కెమెరా ముందు రచ్చ చేసింది అనసూయ. ఈ ఫొటోల్లో ఆమె లుక్ చూసి పిచ్చెక్కిపోతున్నారు నెటిజన్లు.**

అనసూయ అందాల ఆరబోత రోజురోజుకూ శృతిమించుతోంది. ఈ మధ్యకాలంలో రెచ్చిపోతోంది రంగమ్మత్త. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేస్తున్న ఫొటోస్ చూసి కుర్రకారు పిచ్చెక్కిపోతున్నారు. తాజాగా కొన్ని ఫొటోస్ వదిలి వావ్ అనిపించింది అనసూయ. మరింత గ్లామరస్ గా కెమెరా ముందు రచ్చ చేసింది అనసూయ. ఈ ఫొటోల్లో ఆమె లుక్ చూసి పిచ్చెక్కిపోతున్నారు నెటిజన్లు. ప్రైవేట్ పార్టీలో ఎంజాయ్ చేస్తూదాచాల్సిన అందాలన్నీ కెమెరా ముందు పెట్టేసి హల్చల్ చేసింది. దీంతో ఈ ఫొటోస్ క్షణాల్లో వైరల్‌గా మారాయి. మోడ్రన్ దుస్తుల్లో కొత్త ట్రెండ్ క్రియేట్ చేయాలని చూస్తున్న అనసూయ.. తాజాగా కసికసి చూపులతో కటింగ్ ఇచ్చింది. డిఫరెంట్ దుస్తుల్లో కెమెరా ముందు కవ్వించింది. దీంతో ఈ పిక్స్ వైరల్ కాగా.. నెటిజన్లు రెచ్చిపోయి కామెంట్లు చేస్తున్నారు.

జబర్దస్త్ బ్యూటీగా ప్రతి ఒక్కరికీ చేరువైన అనసూయ.. బుల్లితెరకు గ్లామర్ అద్దిన అతికొద్ది మంది యాంకర్లలో ఒకరిగా పేరు సంపాదించింది. మాటలతో మజా చేస్తూనే అందంతో మాయ చేస్తూ పాపులారిటీ పెంచుకుంది. రీసెంట్ గా జబర్దస్త్ కి గుడ్ బై చెప్పిన అనసూయ.. వెండితెరపై తన టాలెంట్ చూపిస్తోంది. వరుస ఆఫర్స్ అందుకుంటూ సెట్స్ మీద బిజీ బిజీ అవుతోంది. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేస్తూ సిల్వర్ స్క్రీన్ జర్నీ కొనసాగిస్తోంది.

రంగస్థలం సినిమాలో రంగమ్మత్తగా చేసి సూపర్ రెస్పాన్స్ అందుకున్న ఈ బ్యూటీ.. పుష్ప సినిమాలో దాక్షాయణిగా చేసి ఆకట్టుకుంది. పలు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తూ జబర్దస్త్ గా దూసుకుపోతోంది. ప్రస్తుతం అనసూయ చేతిలో చాలా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. రీసెంట్ గానే విమానం సినిమాలో వేశ్యగా నటించి విమర్శకుల ప్రశంసల అందుకుంది. పెదకాపు మూవీలో అనసూయ రోల్ కి మంచి మార్కులు పడ్డాయి. సింబా మూవీలో ఫర్వాలేదనిపించింది. అనసూయ డేట్స్ కోసం క్యూ కడుతున్నారు దర్శకనిర్మాతలు. 2010లో సుశాంక్ భరద్వాజ్‌ని ప్రేమ వివాహం చేసుకుంది అనసూయ. వారికి ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తోంది ఈ బ్యూటీ.






# లంకతో ఫైనల్..

## టైటిల్‌పై కన్నేసిన భారత అమ్మాయిలు..!

**వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో శ్రీలంకతో తలపడనుంది. టాపార్డర్, మిడిలార్డర్ సమిష్టిగా రాణిస్తుండడం, బౌలర్లు చెలరేగుతుండడంతో టీమిండియాకు విజయావకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. అయితే.. చమరి ఆటపట్టు బృందాన్ని తక్కువ అంచనా వేయడానికి లేదు. లీగ్ దశలో ఇరుజట్లు చెరొక మ్యాచ్ గెలుపొందాయి. దాంతో, ఆదివారం ప్రేమదాస స్టేడియంలో జరుగబోయే బిగ్ ఫైట్‌లో విజయం ఎవరిని వరిస్తుంది? ట్రోఫీని ముద్దాడేది ఎవరు? అనేది ఆసక్తికరంగా మారింది.**

టీ20 వరల్డ్ కప్‌లో దారుణ ప్రదర్శన తర్వాత భారత జట్టు పుంజుకుంది. ముక్కోణపు సిరీస్‌లో సమిష్టిగా రాణిస్తూ శ్రీలంక, దక్షిణాఫ్రికాలకు చెక్ పెట్టింది. ఆరంభ పోరులో ఓపెనర్లు ప్రతీకా రావల్ అర్ధ శతకంతో రెచ్చిపోగా లంకపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది హర్మన్‌ప్రీత్ సేన. ఆ తర్వాత సఫారీలను 15 పరుగుల తేడాతో చిత్తు చేసింది. అయితే.. తదుపరి పోరులో శ్రీలంక 3 వికెట్లతో విజయం సాధించి భారత్‌కు షాకిచ్చింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికాను ఓడించిన ఇండియా.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో ఆతిథ్య లంకను ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. ఆదివారం 4:30 గంటలకు మ్యాచ్ షురూ కానుంది

ట్రోఫీ కల సాకారం

నిరుడు ఆసియా కప్ ఫైనల్లో భారత జట్టు ఆధిపత్యానికి శ్రీలంక గండి కొట్టింది. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి షాకిస్తూ శ్రీలంక విజేతగా నిలిచింది. దంబుల్లా వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంక బౌలర్ల ధాటికి భారత్ 165 పరుగులకే పరిమితమైంది. ఛేదనలో ఆదిలోనే వికెట్లు పడినా హర్షిత సమరవిక్రమ 69 అజేయంగా నిలిచి చిరస్మరణీయ విజయంతో ట్రోఫీ కలను సాకారం చేసింది.



# చూడడానికి రెండు కళ్లు చాలడం లేదే!

హైదరాబాద్ మహానగరంలో కన్నుల పండుగగా మిస్ వరల్డ్ 2025 ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి MissWorld2025 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దేశీయ ముఖ్యంగా తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక కళలు, పోటీదారుల పాశ్చాత్య కళా ప్రదర్శనల మధ్య మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమైనట్టు ముఖ్యమంత్రి, మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ కరతాల ధ్వనుల మధ్య ప్రకటించారు. తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక కళలు, పోటీదారుల పాశ్చాత్య కళల మేళవింపుతో మిస్ వరల్డ్ ప్రారంభం కాగా, 110 దేశాలకు చెందిన ప్రతినిధులు ర్యాంప్ పై ప్రదర్శనగా వచ్చారు. చివరలో మిస్ ఇండియా నందిని గుప్తా త్రివర్ణ పతాకంతో కార్యక్రమానికి అదనపు ఆకర్షణగా నిలిచారు. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు అండగా, వారి ధైర్య సాహసాలకు నిర్వాహకులు సెల్యూట్ ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా లంబాడా కళాకారులు డప్పు, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రపంచంలోనే ఒకటైన పురాతన కళగా నిర్వాహకులు ప్రకటించారు.

వేదికను అలంకరించిన రంగురంగుల లైట్లు, చుట్టూ సందడి చేస్తున్న ప్రేక్షకులు అన్నీ కలిసి ఒక విజువల్ ఫీస్ట్‌గా మారాయి. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయ హే తెలంగాణ' ఆలాపన ఈ వేడుకను మరింత ప్రత్యేకం చేసినది.

ప్రముఖ రచయిత అందెశ్రీ రచించిన ఈ గీతం 250 మంది నృత్యకళాకారుల సమూహ ప్రదర్శనకు నేపథ్యంగా మారింది.

కళ, శిల్పం, నృత్యం, దేశ భక్తి అన్నీ ఒక్కటే కావడం ఈ ప్రదర్శనలో కనిపించింది.


ప్రేక్షకులను కట్టిపడేసిన ఈ నృత్య విభావం, తెలంగాణ తీరును అద్భుతంగా ప్రతిబింబించింది.



# తెరపైకి వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబో.!

ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నాడు నటుడు విక్టరీ వెంకటేశ్. ఈ చిత్రం దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి వెంకీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా అనంతరం తన తదుపరి సినిమా విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు వెంకీ. ఇప్పటికే పలు కథలు విన్న ఆయన, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో కలిసి పనిచేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. చాలా కాలంగా ఈ ప్రాజెక్ట్ గురించి చర్చలు జరుగుతుండగా, తాజాగా ఇది ఖరారైనట్లు సమాచారం. ప్రస్తుతం దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే వెంకటేశ్‌తో కలిసి కథా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్న ప్రకారం జరిగితే, ఈ ప్రాజెక్ట్ ఈ ఏడాది చివరిలో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం. అయితే, ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వెంకటేశ్ మరియు త్రివిక్రమ్ కలయికలో వస్తున్న తొలి సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి సూపర్ హిట్ చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. ఈ చిత్రాలకు ప్రేక్షకుల నుండి విశేషమైన ఆదరణ లభించింది. దీంతో, వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమా కూడా అదే తరహాలో ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. వింటేజ్ వెంకటేశ్‌ను మళ్లీ చూడబోతున్నామంటూ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అమర వీరుడు కుటుంబానికి ఆర్థిక సాయం



పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకలు ప్రాణాలు కోల్పోవడంతో భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీని తర్వాత పాకిస్తాన్ సైన్యం డ్రోన్లు, యుద్ధ విమానాలను మనదేశం పైకి ప్రయోగించింది. వీటిని మన సైనిక బలగాలు తిప్పికొట్టారు. జమ్మూ కాశ్మీర్ సరిహద్దులో పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమణం చెందారు. మురళీ నాయక్ మరణంతో తల్లిదండ్రులు శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 2022 డిసెంబర్ లో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్ గా ఎంపికయ్యి బోర్డర్ లో సేవలందిస్తున్నారు.

మురళీ నాయక్ వీరమరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మురళి నాయక్ మృతదేహం గోరంట్ల మండలం కళ్లితాండా గ్రామానికి చేరుకున్నట్టు తెలుస్తుంది. మురళినాయక్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మురళీ నాయక్ మరణం చాలా బాధని కలిగించిందని బాలకృష్ణ అన్నారు. ఇక తాజాగా మురళీ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించారు బాలకృష్ణ. తన వంతుగా ఒక నెల జీతాన్ని మురళీ నాయక్ కుటుంబానికి ఇస్తున్నట్టు ప్రకటించారు బాలయ్య. మే 12న బాలకృష్ణ మురళీ నాయక్ స్వగ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి తాను ప్రకటించిన నగదు అందజేయనున్నారు. మురళికి చిన్నతనం నుండే దేశభక్తి అంటే చాలా ఎక్కువ. దీంతో.. రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదులుకొని ఆర్మీలో చేరాడు. పాకిస్తాన్ తీవ్రవాదుల ఎదురుదాడిలో పోరాడి ముగ్గురు తీవ్రవాదులను మట్టుబెట్టి చివరకు తీవ్రవాదుల ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ వీరమరణం పొందారు.. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు తెలిపారు. వీరజవాను మురళీ నాయక్ కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు



# చిన్నవాడితో రొమాన్స్..

రీసెంట్ డేస్‌లో సినిమాల్లో రొమాంటిక్ సీన్స్ కు, బోల్డ్ సన్నివేశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే మనదగ్గర బోల్డ్ సీన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కానీ బాలీవుడ్ లో రొమాంటిక్ సీన్స్ కు కొదవే లేదు. ఇదిలా ఉంటే హీరోయిన్స్ చాలా మంది రొమాంటిక్ సీన్స్ చేయడానికి వెనకాడటం లేదు. కొంతమంది ఇప్పటికీ రొమాంటిక్ సీన్స్ చేయడానికి నో చెప్తానున్నారు. ఇదిలా ఉంటే కొంతమంది తమకన్నా పెద్ద హీరోలతో రొమాన్స్ చేయడానికి సై అంటున్నారు. అలాగే మరికొంతమంది తమ కన్నా చిన్న వాడితో రొమాన్స్ చేయడానికి కూడా రెడీ అవుతున్నారు. ఇప్పుడు ఓ హీరోయిన్ తనకన్నా చిన్న వాడితో రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి హాట్ టాపిక్ గా మారింది. బాలీవుడ్ లో రొమాంటిక్ సీన్స్ లేకుండా.. ఈ మధ్య సినిమాలు రావడం లేదు.. తాజాగా ఓ స్టార్ హీరోయిన్ తనకన్నా దాదాపు ఆరేళ్ళ చిన్నవాడితో రొమాంటిక్ సీన్స్ లో నటించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యింది. ఇంతకూ ఆ హీరో, హీరోయిన్ ఎవరో తెలుసా.? ఇదిలా వెబ్ స్టోరీ.. దానిపేరు "ది రాయల్స్". ఈ వెబ్ సిరీస్ రొమాంటిక్ కంటెంట్ తో తెరకెక్కింది. భూమి పెడ్నేకర్, ఇషాన్ ఖత్తర్ జంటగా నటించారు. ఈ ఇద్దరి మధ్య ఏజ్ గ్యాప్ దాదాపు 6 ఏళ్లు. ఇషాన్ ఖత్తర్ కంటే భూమి పెడ్నేకర్ ఆరేళ్ళు పెద్ద. అయినా కూడా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించారు. తనకన్నా చిన్నవాడితో రొమాంటిక్ సీన్స్ లో నటించడం పై భూమీ స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. ఇంటిమేట్ సీన్స్ లో నటించడం అనేది చిన్న విషయం కాదు. అలాంటి సీన్స్ లో ఇమిడిపోయి నటించడానికి ప్రయత్నిస్తుంటాం.. మాకు కంఫర్ట్ లేకపోతే ఆ సన్నివేశం ఫేక్ గా ఉంటుంది. అందుకే ఆ వెబ్ సిరీస్ లో నటించడానికి ముందే ఇషాన్ ఖత్తర్ తో క్లోజ్ గా ఉండమని టీమ్ నాకు సూచించారు.



# కేక పెట్టించిన కుర్ర భామ..

తమిళ్ లో సూపర్ హిట్‌గా నిలిచిన సినిమాల్లో 96 సినిమా ఒకటి. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి , త్రిష జంటగా నటించిన 96 సినిమా ఎంత పెద్దగా విజయం సాధించిందో అందరికీ తెలుసు. ఈ సినిమాలో సమంత చిన్ననాటి పాత్ర చేసిన నటి గుర్తుందా.? ఆ చిన్నదాని పేరు గౌరీ కిషన్. 96 సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులోనూ ఈ చిన్నదే నటించింది. గౌరి ప్రస్తుతం హీరోయిన్‌గా మూవీస్ చేస్తుంది. తమిళం, మలయాళంలో బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. తెలుగులోనూ ఓ సినిమా చేసింది. సంతోష్ శోభన్ హీరోగా నటించిన సినిమాలో ఈ అమ్మడు హీరోయిన్ గా చేసింది. శ్రీదేవి శోభన్ బాబు అనే సినిమాలో చేసింది ఈ అమ్మడు. ప్రస్తుతం ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. హీరోయిన్‌గా బిజీగా మారుతుందని అంతా అనుకున్నారు. కానీ ఈ అమ్మడు అంతగా సినిమాలు చేయడం లేదు. శ్రీదేవి శోభన్ బాబు సినిమా తర్వాత మరోసారి తెలుగు సినిమాలో నటించలేదు. కానీ అటు తమిళంలో మాత్రం ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్స్ అందుకుంటుంది. తాజాగా గౌరి జీ కిషన్ లేటెస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

# శైలేష్‌తో కామెడీ సినిమా చేస్తా!



'దేశంలో పరిస్థితి సెన్సిటివ్‌గా ఉంది కదా.. ఇలాంటి సమయంలో సినిమా సెలబ్రేషన్స్ చేయడం కరక్టేనా.. అనే చర్చ మా మధ్య జరిగింది. ఓవైపు శత్రువులు మన దేశంలో సృష్టించిన రక్తపాతానికి, సరిహద్దుల్లో మన సైనికులు సరైన సమాధానం చెబుతున్నారు. తాము చేసిన దుశ్చర్య వల్ల ఇండియాలో ఒకచోట సెలబ్రేషన్స్ క్యాన్సిల్ అయ్యాయి.. అనే సాటిస్ఫాక్షన్ కూడా శత్రువులకు మేం ఇవ్వదలచుకోలేదు. అందుకే ఈ సెలబ్రేషన్స్ చేస్తున్నాం' అని నాని అన్నారు.

ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'హిట్: The 3rd case'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఈ నెల 1న సినిమా విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ సక్సెస్‌మీట్‌లో నాని మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఒక క్రైమ్ థ్రిల్లర్‌ని ఒక బిగ్ మాస్ కమర్షియల్ సినిమాగా సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సందర్భంగా ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

దర్శకుడు శైలేష్‌తో వర్క్ చేయడం ఫన్‌గా ఉంటుంది. తను చాలా కూల్. అద్భుతమైన కామెడీ టైమింగ్ కూడా తనలో ఉంది. తనతో నేను చేయబోయే నెక్ట్స్ సినిమా కామెడీ ఎంటైర్టైనర్ అవ్వాలని కోరుకుంటున్నా. అలాగే 'హిట్ 2' సందడి థియేటర్లలో కంటిన్యూ కావాలని ఆశిస్తున్నా.' అని పేర్కొన్నారు నాని.

ఇంకా శైలేష్ కొలను, అడివి శేష, శ్రీనిధి శెట్టి, ప్రొడ్యూసర్ దీప్తి, పావని, శ్రీనాథ్ మాగంటి, అమిత్, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర కూడా మాట్లాడారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com